

# నిజంగా అతడే!

— పి.వి.బి. శ్రీరామ మూర్తి

టీ.వీ. లో వార్తలు చూస్తూ ఉలిక్కిపడ్డాను.

రాజ్యాంగాన్ని గౌరవిస్తానని, దేశ అభివృద్ధికి, రాష్ట్ర అభివృద్ధికి కృషిచేస్తానని చెప్తున్నదీ, మంత్రిగా ప్రమాణం చేసిందీ అతడే!

నా కళ్లు నన్ను మోసపుచ్చటంలేదు కదా?

లేదు... నిజంగా అతడే!

ఆరడగుల ఎత్తున్నవాడు.. ఆజానుబాహుడు... నల్లటి విగ్రహంలాటివాడు... చింతచెట్టులాటి జుట్టుగలవాడు... కోరమీసాలవాడు.. దట్టమైన మబ్బుల్లో జిగేల్మన్న మెరుపులా... నల్లటి ముఖంలో నవ్వితే తెల్లనిపళ్లతో కనిపించినవాడు... చేతి నాలుగు వేళ్లకూ నాలుగు ఉంగరాలు కలవాడు... ఆనందంతో వెలిగిపోతోన్న ముఖంలో కొట్టవచ్చినట్టు కనిపిస్తోన్న క్రౌర్యం గలవాడూ...

నిజంగా అతడే!

సందేహం లేదు..

సరిగ్గా కొన్ని సంవత్సరాలక్రితం...

• • •

నా పనులన్నీ చక్కబెట్టుకుని స్టేషన్‌కెళ్లేసరికి 'ఫ్లాట్‌ఫాం'మీద ట్రైన్ సిద్ధంగా ఉంది కదలటానికి.

కౌంటర్లో టికెట్‌కోసం నిలబడ్డాను నా వెనకాల వ్యక్తి నన్ను బలంగా పక్కకి తోసి, నా చేతిని పచ్చడి చేస్తూ, 'విశాఖ్పానికో టిక్కెటివ్వండి" అన్నాడు.

చెయ్యి నలిగిందన్న బాధో, ట్రైన్ కదిలిపోతుందన్న కంగారుతోనో 'ఏయ్.. ఏంటయ్యా ఇది? నీ కన్నా ముందు నేనున్నానా? కనిపించట్లా?" అన్నాను కోపంగా, నా స్వభావానికి విరుద్ధంగా.

"ఏయ్.. ఏ ఊరుమంది? తప్పుకో.. ఇపుడు నానేముందు... నువ్వే ఎనకా... కాదనగలవా?" అన్నాడు నన్ను వెనక్కి నెట్టేస్తూ. నేను బిక్క చచ్చినట్టు ఉండిపోయాను. అతను టికెట్ తీసుకుని నన్ను మింగేసేటట్టు చూస్తూ వెళ్లిపోయాడు.

"మీరెక్కడికి సార్?" అన్నాడు కౌంటర్లో గుమస్తా.

"విశాఖ పట్నం..." అని కోపంతో "మేనర్లెస్‌బ్రూట్‌లా ఉన్నాడు" అన్నాను.

"వదిలేయండి సార్! అతడి గురించి మీకు తెలీదు" అని టికెట్టు, చిల్లరా చేతిలో పెట్టాడు. నేను గబగబా ట్రైనెక్కేసాను. ట్రైన్ కదిలింది. జనం పక్షుల్లా వేలాడుతున్నారు. కంపార్ట్‌మెంటునిండా పళ్లబుట్టలు. కర్రల కావుళ్లు. దారి మధ్యలో సూట్‌కేసులు. మనిషిమీద మనిషి. మధ్యలో నిలబడ్డ నామీద ఎవరో వచ్చి పడ్డారు. నేను ముందు పడ్డాను. నాముందున్న వ్యక్తి అతని ముందున్న మనిషి మీద పడుతున్నారు. మళ్లీ అట్నించి అదే తొక్కిసలాట. నేను వెనక్కిపడ్డాను. నడ్డి విరిగినంత పనయింది.

"ఏమయ్యా! నీకు బుద్ధుందా? మనిషివేనా? నిండుచూలాలామె. ఆమె నలాగేనా తోస్తావు? ఆమె ఎలా మెలికలు తిరిగిపోతున్నదో చూడు." అన్నాడు ఒరియా కలిసిన తెలుగులో.

"ఏయ్. ఏట్రా కూస్తన్నవు? నిండు సూలాలయితే కారు కట్టించుబే" అన్నాడు అతని చొక్కా పట్టుకుని. పక్కనే ఉన్న ఆమె భర్త తోకతొక్కిన త్రాచులాగా లేచాడు అతని మీద.

ఇందాక కౌంటర్లో నన్ను తోసుకొచ్చినవాడే!

నాకూ కసిగా ఉంది. వాడికి పరాభవం జరిగితే చూడాలనే మనసు ఉబలాట పడుతోంది.

కానీ-

ఏనుగుముందు పిల్లిలాగా అతని ముందు ఆమె భర్త ఏపాటి?

అతను మెడపట్టుకుని మీదకెత్తి వదిలేసాడు.

ఎవరూ ఈ 'బడాశాల్తీ'ని ఏమనలేదు.

కేకలేసుకున్నారు. ఒరియాలో ఏవో తిట్లు తిడుతున్నాడు. ఆమె నొప్పితో అవస్థ పడుతూ, గుడాకు పళ్లు ఎర్రగా ... ముద్దలుగా కనిపిస్తోంటే ఏడుస్తోంది. ఏవో వాళ్ల భాషలో అసహాయురాలై తిడుతున్నట్లుంది.

"ఏయ్. ఏందే?.. బాసలో తిడుతన్నావు. తెలుగులో తిట్టు...నీ పని చెప్తా.." అని మీదకొస్తుంటే.. ఎవరో ముసలాయన... ఈయన గురించి తెలిసినవానిలా ఉన్నాడు... ముందా స్త్రీని మందలించి... ఆ తరువాత ఇతన్ని సముదాయించాడు.

"తాతా! నీ మొగం చూసి పల్లకున్నాను. నేపోతే మర్డర్లు జరిగిపోను" అన్నాడు మీసం మెలేస్తూ.

"ఎందుకు వీరయ్యా! ఆడదాయితో నీకేటి?" అన్నాడు. "ఇందు! సిగిరెట్టు కాల్చు" అని జేబులోంచి సిగిరెట్టు, అగ్గిపెట్టె తీసిచ్చాడు. ఆ తాత భాషలో సంస్కారం కనిపించకపోయినా, డబ్బువల్ల వేషంలో సంస్కారం కనిపిస్తున్నది. ఆ వ్యక్తి సిగిరెట్టు అంటించి పొగమట్టూ వదిలాడు. అనువుకాని చోటు అనుకున్నారో ఏమో ఆ ఒరియావాళ్లు ఊరుకున్నారు.

పార్వతీపురంనుండి రెండు హాల్టింగులు దాటి బొబ్బిలిలో అలిసిపోయినట్టు ఆగింది ట్రైన్. జనం పుట్టల్లోంచి చీమల్లా, ఒకర్ని తోసుకుంటూ ఒకరు, ఒకరినెత్తిమీద మరొకరు కాళ్లతో దాటి ముందుకు చొచ్చుకుపోతున్నారు. ఒరియా వ్యక్తి దిగాడు. ట్రైన్ కదుల్తూండగా వచ్చాడు. అతని వెనకే మరికొంతమందీ ఉన్నారు.

ట్రైన్ స్పీడందుకుంది.

ఒక వ్యక్తి కావాలనే తోసాడో, పొరపాట్నే తోసాడో కానీ ఈ ఆరడుగుల మనిషిని చేత్తో బలంగా నెట్టుకుని ముందుకు పోబోయాడు.

"ఏయ్... కళ్లు కనిపించనేదా?" అన్నాడు




అతడి జబ్బపట్టుకుని ఆపి, ఆ వ్యక్తి ఈ బడామనిషి చేతిమీద పిడికిలితో బలంగా గుద్ది 'వదులుబే..." అన్నాడు.

ఇక అంతే!

కంపార్ట్‌మెంటు కాశ్మీరు సరిహద్దే అయింది.

తిట్లు. రెండు భాషల్లోనూ!

ఇద్దరూ బలంగానే ఉన్నారు. పొట్టేళ్లలా కొట్టుకుంటున్నారు. గర్భిణీ స్త్రీ భర్త ఆరడుగుల మనిషి దవడమీద పిడి గుద్దు గుద్దాడు. ఆ గుద్దుకి మామూలు వ్యక్తి అయితే మొదలు నరికిన చెట్టులా కూలిపోవాల్సిందే

"ఒరేయ్..." పిడుగులు పడినంత భయంకరంగా అరుస్తూ అతన్ని కాలరు పట్టుకుని ఎత్తి... డోరు దగ్గరికెళ్లాడు. అతను ఇంకా పెనుగులాడుతున్నాడు.

ఎవరూ ఊహించలేదు. అతను చేత్తో ఎత్తి... కాల్తో పుట్‌బాల్‌ని తన్నినట్టు తన్ని బండిలోంచి తోసేసాడు. కొద్ది క్షణాల్లో గొలుసులాగడం.. ట్రైన్ ఆగటం జరిగింది. కింద పడిన వ్యక్తి రక్తపు మడుగులో శవమై ఉన్నాడు. నాలుక బయటకొచ్చేసింది చూడ్డానికి భయంకరంగా... హృదయవిదారకంగా కనిపించాడు..

గోల... గోల.... గో..

ట్రైన్‌నుండి జనం దిగిపోయారు.

ఆశ్చర్యం!

ఇంత జరిగినా అతన్నెవరూ ఏం అన్లేదు.

అతనూ భయపళ్లేదు. సిగిరెట్టుమీద, సిగిరెట్టు కాలుస్తున్నాడు. పొగలు వదుల్తున్నాడు.

కాసేపటికి పోలీసు వ్యాన్లు .. అంబులెన్సు వచ్చాయి. అతణ్ని అరెస్ట్ చేసి తీసుకెళ్లారు. ట్రైన్ కదిలింది.

ఆ తరువాత తెలిసింది అతని పేరు వీరాంజనేయులు. ఎమ్మెల్సీకి బావమరిది- "ఏమైనా ఈ దెబ్బతో ఈడు అవుటే అనుకుంటాంగానీ దేనికయినా కాలం రావాల?" అని అనుకుంటున్న జనం మాటలవల్ల.

❀ ❀ ❀

నేను కుతూహలంగా టీవీ చూస్తున్నాను.

సరిగ్గా అతని పేరు చెప్పారు. వీరాంజనేయులే. రాష్ట్ర అభివృద్ధికి తన రక్తం ధారపోస్తానంటున్నదీ.. రాజ్యాంగాన్ని కాపాడతానన్నదీ... నాడు ట్రైన్లోంచి మనిషిని పైకి పంపిందీ.. అతడే నిజంగా అతడే! మంత్రిగా ప్రమాణం చేస్తున్నదీ అతడే!

ఈ దేశ భవితవ్యాన్ని తల్చుకుంటే నాకు భయం వేస్తోంది.

■